క్లుప్తంగా

దరఖాస్తుల ఆహ్వానం

అర్వపల్లి : 2024–25 విద్యా సంవత్సరంలో 4వ తరగతి పూర్తి చేస్తున్న బాలికలు 5వ తరగతిలో గురుకులంలో చేరడానికి వెంటనే దరఖాస్తులు చేసుకోవాలని జాజిరెడ్డిగూడెం ఎస్సీ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ప్రిన్సిపాల్ ఎం. అరుణ తెలిపారు. గురువారం విలేకరులతో మాట్లాడారు. అలాగే అన్ని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ఆరో తరగతి నుంచి తొమ్మిదవ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లకు కూడా అర్హులైన విద్యార్థినులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 30 వరకు దరఖాస్తులకు చివరి గడువని చెప్పారు. ఫిబ్రవరి 23న పరీక్ష ఉంటుందని తెలిపారు.

ఎస్సారెస్పీ నీళ్లు వచ్చేలా చూడాలని వినతి



తిరుమలగిరిలోని ఈఈ కార్యాలయంలో వినతిపత్రం అందజేస్తున్న రైతులు

అర్వపల్లి : మండల పరిధిలోని కొమ్మాల గ్రామంలో ఎస్సారెస్పీ 10ఎల్ మైనర్ కాలువకు గోదావరి జలాలు రావడం లేదని, నీళ్లు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కోరుతూ గురువారం గ్రామ రైతులు తిరుమలగిరిలోని నీటి పారుదలశాఖ ఈఈ కార్యాలయంలో టెక్నికల్ డీఈ శివరామకృష్ణకు వినతిపత్రం అందజేశారు. ఈ కాలువ నిర్వహణ సరిగా లేకపోవడంతో కంపచెట్లు, మట్టితో నిండిపోయిందని తెలిపారు. అలాగే తూము, రాళ్లు ఇసుకతో పేరుకపోయాయని చెప్పారు. కాలువను వెంటనే మరమ్మతు చేయించి నీళ్లు వచ్చేలా చూడాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతులు కుంటిగొర్ల శ్రీను, బొరోజు ఉపేందర్, పగిడి సోమయ్య, భద్రి, శంకర్, ఉమేష్, ఉపేందర్, జనార్దన్, మహేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

'అవమానించేలా మాట్లాడటం తగదు'

● కాంగ్రెస్ నాయకురాలు బోయలపల్లి రేఖ

అర్వపల్లి : ఎంపీ ప్రియాంకగాంధీని అవమానపరిచేలా బీజేపీ నేత రమేష్‌బిదూరి మాట్లాడటం తగదని రేఖ చారిటబుల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, మహిళా కాంగ్రెస్ నాయకురాలు డాక్టర్ బోయలపల్లి రేఖ అన్నారు. బుధవారం విలేకరులతో మాట్లాడారు. బీజేపీకి మహిళలంటే గౌరవం లేదని అన్నారు. దేశం కోసం ఎన్నో త్యాగాలు చేసిన గాంధీ కుటుంబాన్ని అవమానించేలా మాట్లాడటం సిగ్గుచేటని తెలిపారు. ఇప్పటికే హోంమంత్రి అమిత్‌షా అంబేద్కర్‌ని కించపరిచేలా మాట్లాడారని చెప్పారు. మీడియాలో ప్రచారం కోసం, సంచలనాల కోసం గాంధీ కుటుంబంపై వివాదస్పద వ్యాఖ్యలు చేయవద్దని హితవు పలికారు.

మృతుడి కుటుంబాన్ని ఆదుకోవాలి




మాట్లాడుతున్న చెవిటి వెంకన్నయాదవ్

నాగారం : ఈటూరు ఆవాసం ప్రగతినగర్ పత్తిమిల్లులో ఇటీవల మృతి చెందిన కూలీ కుటుంబాన్ని మిల్లు యాజమాన్యం ఆదుకోవాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, వ్యవసాయ సంక్షేమ శాఖ రాష్ట్ర కమిటీ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. గురువారం ప్రగతినగర్ పత్తిమిల్లును సందర్శించి మాట్లాడారు. పత్తిమిల్లులో బిహార్ రాష్ట్రానికి చెందిన కూలీ మృతిపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా మహిళా అధ్యక్షురాలు తిరుమలప్రగడ అనురాధ, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆకుల బుచ్చిబాబు, మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్య, ఆకుల ప్రతాప్, షేక్ యాకుబ్‌వలీ, దశరథ, జాజుల వీరయ్య, పానుగంటి నరసింహారెడ్డి పాల్గొన్నారు.

ఒకరోజు అదనంగా జలాలు

అర్వపల్లి : యాసంగి సీజన్‌కుగాను జిల్లాకు విడుదల చేసిన గోదావరి జలాలు వారబంధి విధానంలో బుధవారం రాత్రితో నిలిచిపోనున్నాయి. కాగా తుంగుతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్ వినతి మేరకు నీటి పారుదలశాఖ అధికారులు గురువారం కూడా అదనంగా గోదావరి జలాలను కొనసాగించారు. చెరువులు, కుంటలు నిండేలా చూడాలని అధికారులకు ఎమ్మెల్యే ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు.

ఎరువుల దుకాణాల్లో తనిఖీ



నెమ్మికల్‌లోని ఎరువుల షాపులో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

ఆత్మకూర్ (ఎస్) : మండల పరిధిలోని ఆత్మకూర్ (ఎస్), నెమ్మికల్ గ్రామాల్లోని ఎరువుల దుకాణాలను జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అలాగే మండలంలో సాగు చేస్తున్న వేరుశనగ పంటను పరిశీలించి రైతులకు సస్య రక్షణ చర్యలు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి డి.దివ్య, వ్యవసాయ విస్తరణ అధికారి ఎస్.పవన్ పాల్గొన్నారు.

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు





సూర్యాపేటలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో లడ్డూలు, పూలు సిద్ధం చేస్తున్న వికాస తరంగిణి, ఆండాల్ గోష్టి బృందం సభ్యులు

● వైకుంఠాన్ని తలపించేలా ముస్తాబైన శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయం
● భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ఇవ్వనున్న స్వామివారు

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం ముక్కోటి(వైకుంఠ) ఏకాదశి సందర్భంగా ఉత్తర ద్వార దర్శనానికి ఏర్పాట్లు చేశారు. ఆలయంలో ప్రత్యేక మందిరాన్ని ఏర్పాటు చేసి భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పిస్తారు. జిల్లా కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠం తలపించేలా ఏడు గోపురాలను ఏర్పాటు చేశారు. స్వామివారిని ఉత్తర ద్వార దర్శనం చేసుకునేలా శ్రీవైకుంఠ మందిరాన్ని సిద్ధం చేశారు.

సుమారు 25వేల మంది భక్తులు..

సూర్యాపేట జిల్లా కేంద్రంలోని శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రతి ఏడాది ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక క్యూలైన్లు ఏర్పాటు చేశారు. ఉదయం 5గంటల నుంచే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ప్రారంభిస్తారు. స్వామి వారిని సుమారు 25వేల మంది భక్తులు దర్శించుకోనున్నారు.



అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలో ముస్తాబైన శ్రీయోగానంద లక్ష్మీనర్సింహస్వామి ఆలయం

ముక్కోటి ఏకాదశికి ఏర్పాట్లు పూర్తి

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ముక్కోటి ఏకాదశి ఉత్సవానికి ఏర్పాట్లు పూర్తి చేశారు. ఉత్సవంలో భాగంగా శుక్రవారం స్వామి ఉత్తరద్వార దర్శనం జరగనుంది. నర్సింహస్వామిని గరుడ వాహనంపై అధిరోహింపజేసి విశేష పూజలు జరిపి ఆలయంలో ఊరేగిస్తారు. గాయకుడు శ్రీనివాసగుప్త ఆధ్వర్యంలో హనుమాన్‌ఛాలీసా భక్తబృందం ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామ పారాయణం, భజనలు, నామ సంకీర్తనలు, కోలాటాలు జరగనున్నాయని అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్ తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

భక్తులకు ఇబ్బందులు లేకుండా..

శుక్రవారం ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించేందుకు శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక వైకుంఠ మందిరాన్ని ఏర్పాటు చేశాం. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉదయం 5గంటల నుంచే భక్తులకు ఉత్తర ద్వార దర్శనం ప్రారంభిస్తాం. ప్రతి సామాన్య భక్తుడికి కూడా దర్శనమయ్యేలా ఏర్పాట్లు చేశాం.

– నల్లాన్‌చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు, శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయ ప్రధాన అర్చకులు

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీ

సూర్యాపేటటౌన్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని గురువారం సాయంత్రం కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆస్పత్రిలో రోగులతో మాట్లాడుతూ వారికి అందుతున్న వైద్యసేవలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆస్పత్రిలోని పలు విభాగాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ఆస్పత్రిని ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. డాక్టర్లు ఎల్లప్పుడూ రోగులకు అందుబాటులో ఉండాలని అన్నారు. డాక్టర్లకు, సూపరింటెండెంట్ సత్యనారాయణకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఆయన వెంట డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం, వైద్యసిబ్బంది ఉన్నారు.



రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్

స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధం కావాలి

భానుపురి : స్థానిక సంస్థల ఎన్నికల్లో అన్ని స్థానాల్లో పోటీ చేయడానికి తెలంగాణ జన సమితి కార్యకర్తలు, నాయకులు సిద్ధం కావాలని తెలంగాణ జన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ ధర్మార్జున్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జరిగిన నియోజకవర్గ సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. స్థానిక సంస్థల్లో విద్యావంతులు, నిజాయితీపరులైన యువకులను ప్రోత్సహించి ఎన్నికల్లో నిలబెట్టాలన్నారు. ఈ సమావేశంలో యువజన సమితి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కిరణ్ కుమార్, పార్టీ జిల్లా కార్యదర్శి బొడ్డు కిరణ్‌గౌడ్, రైతు జన సమితి జిల్లా అధ్యక్షుడు కొల్లు కృష్ణ, బచ్చలకూరి గోపి, శ్రీనివాస్ నాయక్, సూర్యనారాయణ, సుమన్ నాయక్, బొమ్మగాని వినయ్ గౌడ్, ఏనుగు మధుసూదన్‌రెడ్డి, బానోత్ సైదానాయక్, మల్సూర్, సతీష్, ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ధర్మార్జున్

రోడ్డు భద్రతపై పోలీసుల ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ



తుంగతుర్తిలో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

తుంగతుర్తి : ద్విచక్రవాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ రుద్రక్రాంతికుమార్ అన్నారు. గురువారం జాతీయ రోడ్డు భద్రతా వారోత్సవాలలో భాగంగా మండల కేంద్రంలో పోలీసులతో ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. మద్యం మత్తులో వాహనాలను నడపవద్దని అన్నారు. హెల్మెట్ ధరించకపోవడం వల్ల ప్రమాదాలు జరిగినప్పుడు ప్రాణాలు కోల్పోయే అవకాశం ఉందని తెలిపారు. తప్పనిసరిగా వాహనాలకు నంబర్ ప్లేట్ ఉండాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని అన్నారు. ప్రమాదాల నివారణకు తీసుకోవలసిన జాగ్రత్తలపై ప్రజలకు, వాహనదారులకు వివరించారు.



నాగారంలో క్యూఆర్ కోడ్‌ను ప్రదర్శిస్తున్న సీఐ

పోలీసుల పనితీరుపై అభిప్రాయాలు తెలపాలి

నాగారం : పోలీసుల పనితీరు, ప్రవర్తన, స్పందించిన విధానం తదితర అంశాలపై ప్రజలు తమ అభిప్రాయం తెలపాలని సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ ఎం.ఐలయ్య కోరారు. గురువారం మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో క్యూ ఆర్ కోడ్ పద్ధతిని ప్రారంభించి మాట్లాడారు. క్యూఆర్ కోడ్ ద్వారా పోలీసుల సేవలపై పిటిషనర్లు, బాధితులు తమ అభిప్రాయాన్ని సులభంగా తెలియజేసే అవకాశం ఉందని తెలిపారు. ఫిర్యాదులు, పిటిషన్, ఎఫ్ఐఆర్, ఈ చాలన్, ట్రాఫిక్ ఉల్లంఘనలు, పాస్‌పోర్ట్ ధ్రువీకరణ తదితర అంశాల గురించి తమ అభిప్రాయాలు తెలియజేయవచ్చని తెలిపారు.

11న అక్షర సంక్రాంతి సంబరాలు

సూర్యాపేట : అక్షర ఫౌండేషన్ సూర్యాపేట, సంకినేని కృష్ణారావు కన్‌స్ట్రక్షన్స్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ వారి ఆధ్వర్యంలో ఈ నెల 11న సూర్యాపేటలోని మినీట్యాంక్ బండ్ వద్ద జిల్లా స్థాయి అక్షర సంక్రాంతి సంబరాలు నిర్వహిస్తున్నట్లు అక్షర ఫౌండేషన్ చైర్మన్ యాస రాంకుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం అక్షర ఫౌండేషన్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ముగ్గుల పోటీలు, గంగిరెద్దుల విన్యాసాలు, హరి దాసు కీర్తనలు, గాలి పతంగులు ఎగరవేయుట, మహిళా కోలాట పోటీలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ.2016, ద్వితీయ బహుమతి రూ.1516, తృతీయ బహుమతి రూ. 1016, కన్సోలేషన్ బహుమతి రూ.516 విలువ గల చీరలు, కోలాట విజేతలకు ఇదే విలువ గల బహుమతులు అందజేస్తామని తెలిపారు. ముగ్గుల పోటీల్లో పాల్గొనే ప్రతి ఒక్కరికీ ప్రత్యేక బహుమతి అందజేస్తామని పేర్కొన్నారు. ఈ సంబరాలు మధ్యాహ్నం 3గంటలకు మినీ ట్యాంక్ బండ్ వద్ద ప్రారంభమవుతాయని తెలిపారు. ఈ సమావేశంలో అక్షర ఫౌండేషన్ అధ్యక్ష, కార్యదర్శులు ఉప్పు నాగయ్య, రుద్రంగి కాళిదాస్, ప్రోగ్రాం కన్వీనర్స్ సాల్లేటి ఉపేంద్రచారి, బత్తుల ఉపేందర్, షేక్ నజీర్‌బాషా, అక్షర సభ్యులు నరాల తిరుమల రెడ్డి, నెల్లూరు పాపయ్య, సుభాష్‌చంద్రబోస్, రాచకొండ నాగయ్య, పీర్లపాటి వెంకన్న, కాసర్ల సైదులు, రాచకొండ సైదులు, బానాల రాంరెడ్డి, అప్పారావు, యాస శృతి, మద్రు ప్రియాంక పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

చివ్వెంల : విద్యుత్ లైన్ల మరమ్మతు నేపథ్యంలో జి.తిరుమలగిరి సబ్ స్టేషన్ పరిధిలోని పలు గ్రామాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఏఈ మల్లయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జి.తిరుమలగిరి, గుంపుల, గుంజలూరు, నామవరం గ్రామాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. ఆయా గ్రామాలతోపాటు, వ్యవసాయ మోటార్లకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

కంటి వైద్యశిబిరం

పెన్‌పహాడ్ : లయన్స్ కంటి ఆస్పత్రి సూర్యాపేట ఆధ్వర్యంలో గురువారం చీదెళ్ల గ్రామంలో ఉచిత కంటి వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని లయన్స్ కంటి ఆస్పత్రి ఏఓ పటేల్ నర్సింహారెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా 150మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప్పల రాజేంద్రప్రసాద్, దేవిరెడ్డి రవీందర్‌రెడ్డి, పవన్‌కుమార్, వీరేందర్ తదితరులు పాల్గొన్నారు.

మీ సేవ కేంద్రం తనిఖీ

తిరుమలగిరి : మండల కేంద్రంలోని మీ సేవ కేంద్రాన్ని గురువారం తహసీల్దార్ బి.హరిప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. మీ సేవ కేంద్రాల్లో సర్టిఫికెట్లపై ఎక్కువ మొత్తంలో రుసుము వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ సుశిత్‌రెడ్డి, సర్వేయర్ జోసఫ్, జూనియర్ అసిస్టెంట్ అశోక్ పాల్గొన్నారు.

ప్రగతికి దారులు వేస్తూ.. శాంతి కోసం పోరాడాలి



మాట్లాడుతున్న కేవీఎల్

భానుపురి : ప్రగతికి దారులు వేసి శాంతి కోసం పోరాడాలని అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం తెలంగాణ రాష్ట్ర సమన్వయ ప్రధాన కార్యదర్శి కేవీఎల్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో అఖిల భారత శాంతి సంఘీభావ సంఘం జిల్లా సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పాలస్తీనాపై ఇజ్రాయిల్ చేస్తున్న యుద్ధం, రష్యా – ఉక్రెయిన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ప్రపంచానికి జరుగుతున్న నష్టంపై మేధావులు, అభ్యుదయవాదులు గళం విప్పాలన్నారు. ప్రపంచ శాంతి సాధన కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు తొగటి మురళి, జిల్లా నాయకురాలు అనంతుల మల్లేశ్వరి, రంగారెడ్డి జిల్లా సమన్వయ ప్రధాన కార్యదర్శి పోలగాని రవి, జిల్లా కార్యదర్శి గుగులోతు రాజారాం, బూర వెంకటేశ్వర్లు, జిల్లా నాయకులు చామల అశోక్ కుమార్, నిమ్మల ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా సహస్ర దీపాలంకరణ



జాజిరెడ్డిగూడెంలోని దేవాలయంలో దీపాలు వెలిగిస్తున్న మహిళలు

అర్వపల్లి : జాజిరెడ్డిగూడెంలోని శ్రీయోగానంద లక్ష్మీ నర్సింహస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. ఉత్సవాలలో భాగంగా గురువారం సహస్ర దీపాలంకరణ కార్యక్రమాన్ని జరిపారు. ఈ సందర్భంగా ఆలయంలో మహిళలు వెయ్యి దీపాలను వెలిగించారు. మంగళహారతులతో గోదాదేవికి కుంకుమార్చన కార్యక్రమం నిర్వహించారు. అలాగే భక్తి కీర్తనలు ఆలపించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు రాంబాబుఅయ్యంగార్, పవన్‌కుమార్, భక్తులు పాల్గొన్నారు.

నిబద్ధతతో పనిచేస్తే ఎల్లప్పుడూ గుర్తింపు




ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ రవి

పెన్‌పహాడ్ : వృత్తి పట్ల అంకితభావం, నిబద్ధతతో పనిచేస్తే సమాజంలో ఎల్లప్పుడూ గుర్తింపు లభిస్తుందని ఎంఈఓ నకిరేకంటి రవి అన్నారు. చిన సీతారాంతండా, ఎల్లప్పకుంట తండా ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తూ ఇటీవల బదిలీపై వెళ్లిన అసానబాద చంద్రశేఖర్, కందుల మురళీకృష్ణను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు గురువారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కొచ్చెర్ల ప్రభాకర్, సంద్యాల వినోద్, గొల్లపూడి శ్రీకాంత్, నల్లా శ్రీనివాసులు, మేకల రాజశేఖర్, కొనుగంటి గవాస్కర్‌రెడ్డి, సంద సైదిరెడ్డి, బానోతు రాంజీ, మన్నె రామిరెడ్డి, బైరెడ్డి భద్రారెడ్డి, ఎడవెల్లి శ్రీధర్‌రెడ్డి, మానుపూరి రమేష్, మూసూద్, మేడారపు శైలజ, ముత్తినేని స్నేహలత, గండు సతీష్ తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహ విద్యార్థులకు దుప్పట్ల పంపిణీ

నాగారం : పసునూర్ మోడల్ స్కూల్ వసతి గృహ విద్యార్థులకు గురువారం స్ఫూర్తి ఫౌండేషన్ సౌజన్యంతో దుప్పట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ వాసం ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. స్ఫూర్తి ఫౌండేషన్ సేవలు అభినందనీయం అన్నారు. తల్లిదండ్రులు లేని 22 మంది మోడల్‌స్కూల్ విద్యార్థుల విద్యకు అయ్యే ఖర్చును స్ఫూర్తి ఫౌండేషన్ భరిస్తుందని తెలిపారు. పసునూర్ మోడల్‌స్కూల్‌లో చదివి నీట్ ర్యాంక్ సాధించిన శిగా గౌతమి చదువుకు అయ్యే ఖర్చు భరించడంపై అభినందనలు తెలిపా రు. కార్యక్రమంలో మోడల్ స్కూల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు భూతం యాకమల్లు, ప్రిన్సిపాల్ బల్గూరి చంద్రబాబు, కేజీబీవీ ఎస్‌ఓ షిరిన్, శ్రీనివాస్, కేర్ టేకర్ లత, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఎంఈఓ ప్రభాకర్

ఉమ్మడి జిల్లా స్థాయి క్రీడా పోటీలు ప్రారంభం

నాగారం : గ్రామీణ ప్రాంతాల్లోని యువత క్రీడల్లో రాణించాలని సూర్యాపేట డీఎస్పీ రవి అన్నారు. క్రాంతి యువజన సంఘం 25వ వార్షికోత్సవం సందర్భంగా గురువారం నాగారం మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉమ్మడి నల్లగొండ జిల్లా స్థాయి కబడ్డీ, వాలీబాల్ క్రీడలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. విద్యార్థులు, యువత చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలన్నారు. క్రీడలు శారీరక దృఢత్వానికి, మానసిక ఉల్లాసానికి దోహదపడుతాయని తెలిపారు. గెలుపు, ఓటములను సమానంగా తీసుకోవాలని క్రీడాకారులకు సూచించారు. క్రాంతి యువజన సంఘం ఆధ్వర్యంలో విద్యా, వైద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక, సామాజిక, రాజకీయ చైతన్యానికి కృషి చేయడం అభినందనీయమని తెలిపారు. ఎస్‌ఐ ఫౌండేషన్ ఆధ్వర్యంలో క్రీడాకారులకు భోజన సౌకర్యం కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మారయ్య, నాగారం సీఐ రఘువీర్‌రెడ్డి, ఎస్‌ఐ ఎం.ఐలయ్య, ఎస్‌ఐ ఫౌండేషన్ సీఈఓ వీరయ్య, క్రాంతి యువజన సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు చిప్పలపల్లి విక్రం, అధ్యక్షుడు చిప్పలపల్లి చిరంజీవి, ఉపాధ్యక్షుడు ఉపేందర్, ప్రధాన కార్యదర్శి కూరం వెంకన్న, దేవరకొండ మురళి, చంద్రశేఖర్, శివ, మల్లేష్, గిరి, రామకృష్ణ, చిన్ని, పండు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కబడ్డీ పోటీలను ప్రారంభిస్తున్న డీఎస్పీ రవి

పాఠశాలల్లో సంక్రాంతి ముగ్గుల పోటీలు

చివ్వెంల : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని దురాజ్‌పల్లి గ్రామ శివారులోని శ్రీస్వామి నారాయణ్ గురుకుల పాఠశాలలో గురువారం విద్యార్థుల తల్లిదండ్రులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు ముత్యాల ముగ్గులు, భోగిమంటలు, హరిదాసు చిత్రాలు వంటి ముగ్గులను వేసి ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. ప్రతిభ కనబర్చిన మహిళలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సీహెచ్. శ్రీనివాస్ ఆనంద్, డైరెక్టర్ హర్షిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నూతనకల్ : మండల కేంద్రంలోని నాగార్జున ఉన్నత పాఠశాలలో సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకొని విద్యార్థినులకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ మారగాని వెంకట్‌గౌడ్ మాట్లాడారు. పాఠశాల స్థాయి నుంచే విద్యార్థులకు సంస్కృతి, సంప్రదాయాల పట్ల అవగాహన పెంపొందిస్తున్నట్లు తెలిపారు. అనంతరం పోటీల్లో ప్రతిభ కనబర్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మారగాని విజయలక్ష్మి, గుర్రం యాదగిరి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



నూతనకల్ : నాగార్జున ఉన్నత పాఠశాలలో ముగ్గులు వేస్తున్న విద్యార్థినులు



చివ్వెంల : స్వామి నారాయణ్ గురుకుల పాఠశాలలో ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

సంక్షిప్త సమాచారం

గిట్టుబాటు ధర కల్పించాలని వినతి

భానుపురి: పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని అఖిల భారత ఐక్య రైతు సంఘం డివిజన్ నాయకుడు పాన్నాల లచ్చిరెడ్డి అన్నారు. గురువారం రైతు డిమాండ్ డే సందర్భంగా సంఘం జాతీయ కమిటీ పిలుపు మేరకు కలెక్టర్ కార్యాలయ ఏఓ సుదర్శన్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సామ సత్తిరెడ్డి, గోగుల వీరబాబు, శంకర్, జాన్ సుందర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పార్టీకి పూర్వ వైభవం ఖాయం

సూర్యాపేటటౌన్ : తెలుగుదేశం పార్టీ నిరుపేదల పార్టీ అని, రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీకి పూర్వ వైభవం రావడం ఖాయమని తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కాని నరసింహులు అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆరో వార్డులో తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షుడు గాజుల వెంకన్న అధ్యక్షతన నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆయన పరిశీలించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో మహబూబ్‌నగర్ పార్లమెంట్ అడహక్ కమిటీ సభ్యులు కుమార్ గౌడ్, సూర్యాపేట నియోజకవర్గ ఇన్‌చార్జ్ నాతాల రాంరెడ్డి, ధరావత్ వెంకన్న, ఏర్పుల లింగయ్య, నకిరేకంటి నాగయ్య, రవి నాయక్, మామిడి వెంకన్న, సైదులు పాల్గొన్నారు.

సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

మద్దిరాల : గుమ్మడవెల్లి గ్రామంలో సోలార్ ప్లాంట్ ఏర్పాటుకు తహసీల్దార్ అమీన్‌సింగ్ గురువారం స్థలాన్ని పరిశీలించారు. గుమ్మడవెల్లిలోని 8 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని గుర్తించి, 6 ఎకరాలను సోలార్ పవర్ ప్లాంట్‌కు కేటాయిస్తూ నివేదికనుపై ఉన్నత అధికారులకు పంపించినట్లు తహసీల్దార్ తెలిపారు.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పనిచేయాలి

చివ్వెంల : పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని బీజేపీ జిల్లా ఎన్నికల అధికారి నాగురావ్ నామాజీ అన్నారు. గురువారం సూర్యాపేట జిల్లాలోని పలు మండలాలకు అధ్యక్షులను ఎంపిక చేసి నియామక పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సహాయ ఎన్నికల అధికారులు అక్కిరాజు యశ్వంత్, చల్లమల్ల నర్సింహ, బొబ్బ భాగ్యరెడ్డి, కర్నాటి కిషన్ తదితరులు పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి

మద్దిరాల : రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు గోట గోపి అన్నారు. గురువారం పోలుమల్లలో ఏర్పాటు చేసిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను సక్రమంగా అమలు చేయకుండా జాప్యం చేస్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి పోలోజు సైదులు, నాయకులు ఆకుల రమేష్, పాతూరి మల్లారెడ్డి, చిదిరాల నారాయణ, చిలువేరు చంద్రయ్య, తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నాగారం : వర్ధమానుకోటలో ఈ నెల 16న జరిగే యానాల వీరారెడ్డి వర్ధంతి సభను జయప్రదం చేయాలని ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలెబోయిన కిరణ్ కోరారు. గురువారం వర్ధమానుకోటలో కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఏఐకేఎంఎస్ జిల్లా నాయకులు జాజుల సామేలు, గంట పెద్దమల్లయ్య, గంట మల్లయ్య, కన్నబోయిన కొమరామల్లు, యానాల వీరారెడ్డి, ఆటో యూనియన్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుడికి గాయాలు

ఆత్మకూర్ (ఎస్) : ప్రమాదవశాత్తు తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలైన సంఘటన నెమ్మికల్‌లో గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మడ్డి రాములు (39) గురువారం సాయంత్రం తాటిచెట్టు ఎక్కుతుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడ్డాడు. ఈ ప్రమాదంలో రాములు తీవ్రంగా గాయపడగా చికిత్స నిమిత్తం సూర్యాపేటలోని ఏరియా ఆస్పత్రికి తరలించారు.